క్లుప్తంగా

రోగాల బారిన పడకుండా వ్యాక్సినేషన్



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): శిశువులు ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సినేషన్ వేయించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక శ్రీరామనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల వయస్సు వరకు పలు విడతలుగా వ్యాక్సినేషన్ పిల్లలకు వేయించాలన్నారు. పుట్టిన బిడ్డ నుంచి షెడ్యూల్ మేరకు టీకాలు ఇవ్వడం వల్ల క్షయ, కంఠసర్పి, అంధత్వం, కామెర్లు, అతిసారం, ధనుర్వాతం, పోలియో, నిమోనియా, కోరింతదగ్గు, హెపటైటిస్ బి వంటి వ్యాధులు రాకుండా నియంత్రించవచ్చునని తెలిపారు. అనంతరం ఆయన శిశువులకు విటమిన్-ఎ ద్రావణాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎం ప్రసాద్, ప్రాజెక్ట్ఇన్సుసయ్యద్ ఖలీల్,వైద్యసిబ్బందిపాల్గొన్నారు

హాలహర్విలో చోరీ

నందవరం : మండలంలోని హాలహర్వి గ్రామంలో వేకువజామున మూడు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన హరిజన జయన్న కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా దొంగలు ఇంట్లో చొరబడి ట్రంకు పెట్టెను ఎత్తుకెళ్లారు. పెట్టెను పగులగొట్టి ముళ్లపొదల్లో పాడేసి, అందులో రూ.50 వేలు నగదు, 16 తులాల వెండి కాళ్ల కడియాలు, మెట్టలు తీసుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన జగన్నాథ్‌రెడ్డి ఇంట్లో బీరువాను పగులగొట్టి రూ.7.5 లక్షల నగదు, 9 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

డోన్ రూరల్ : మండల పరిధిలోని మల్యాల గ్రామం వద్ద శుక్రవారం రాత్రి రైలు నుంచి జారిపడి గౌరబ్‌మిత్రా(22) మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని పరిశీలించామన్నారు. ఆధార్, సెల్‌ఫోన్ ఆధారంగా వెస్ట్‌బెంగాల్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. డోన్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు.

కోడుమూరు.. అభివృద్ధి జోరు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కోడుమూరు నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి. ఈ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ కావడంతో దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. 2014-19 టీడీపీ హయాంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. నీరు-చెట్టు పేరుతో రూ.120 కోట్ల వరకు జరిగిన పనుల్లో ఆ పార్టీ నేతలు నిధులను స్వాహా చేసి నాసిరకంగా పనులను చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో సుమారు రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేసింది. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల ఏర్పాటుతో పాటు నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పల్లెలు కొత్త కళను సంతరించుకున్నాయి. అలాగే గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేయడంతో రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి.



ప్యాలకుర్తిలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

- నియోజకవర్గంలో రూ.300 కోట్ల అభివృద్ధి పనులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో మారిన గ్రామాల రూపురేఖలు
- ప్రభుత్వ భవనాలతో కొత్త కళ
- దశాబ్దాలుగా అమలుకు నోచుకోని పనులు పూర్తి



పులకుర్తిలో రూ.2 కోట్లతో నిర్మించిన హైస్కూల్ భవనం



కోడుమూరు-ముడుమలగుర్తి రోడ్డు



పులకుర్తిలో నిర్మించిన గ్రామ సచివాలయం

కోడుమూరు: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. గ్రామాల్లో అంగన్‌వాడీ, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మిస్తుండడంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల పరిధిలో పేద ప్రజలకు నిర్మిస్తున్న 1,862 ఇండ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.22 కోట్లు మంజూరు చేసింది. నియోజకవర్గంలో 95 సచివాలయాల భవన నిర్మాణాల కోసం రూ.42 కోట్లు, 90 ఆర్బీకేలకు రూ.19 కోట్లు, 64 హెల్త్ సెంటర్ల కోసం రూ.12 కోట్లు ఖర్చు చేసింది. నాడు-నేడు పథకం కింద కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో రెండు విడతలుగా సుమారు రూ.90 కోట్లు ఖర్చు చేసింది.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

గూడూరు నుంచి ఆర్.ఖానాపురం రోడ్డు గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. 2013లో చంద్రబాబు పాదయాత్ర చేస్తూ 2014లో అధికారంలోకి వస్తే ఈ రోడ్డు వేయిస్తానని మాటిచ్చి రోడ్డు వేయలేదు. 2020లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.7కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసింది. రూ.6 కోట్లతో గూడూరు- కొత్తకోట రోడ్డు, రూ.10 కోట్లతో గూడూరు-పెద్దనాటూరు రోడ్డు, రూ.56 లక్షలతో ముడుమలగుర్తి రోడ్డు.. రూ.10 కోట్లతో పెంచికలపాడు-గూడూరు రోడ్డు, రూ.10 కోట్లతో మాసమసీద్-సుంకేశుల రోడ్డుతో పాటు గొందిపర్ల, బి.తాండ్రపాడు, పసుపుల, సూదిరెడ్డిపల్లె గ్రామాలకు రూ.5కోట్లతో బీటీ రోడ్లు, వెంకాయపల్లె నుంచి గార్గేయపురం వరకు రూ.15 కోట్లతో బీటీ రోడ్లు వేసింది. కోడుమూరు నుంచి కృష్ణాపురం వరకు రూ.5 కోట్లతో రోడ్డు నిర్మించింది. గూడూరు నుంచి చనుగొండ్ల మీదుగా కోడుమూరు వరకు రూ.6.76 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులను చేపట్టింది. కోడుమూరు-ఎమ్మిగనూరు రోడ్డుపై రూ.2కోట్లతో కాజ్‌వేను నిర్మించి సమస్యను పరిష్కరించింది.

వివిధ పనులకు నిధుల మంజూరు

గూడూరు నగర పంచాయతీలో తాగునీటి సమస్య ఉంది. సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.54 కోట్లను విడుదల చేసింది. గూడూరు పట్టణంలో నాలుగు ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, రెండు సంపులను నిర్మించి పట్టణంలోని వివిధ ప్రాంతాలకు పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి సుంకేసుల ద్వారా నీటిని అందించాలనేది ఈ పథకం ఉద్దేశం. క్రిష్ణగిరి మండలం, కోడుమూరు మండలాల పరిధిలోని 13 గ్రామాలకు రాకపోకల్లేక ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజలు అవస్థలు పడేవారు. 2017లో వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు గోరంట్ల హంద్రీనదిపై బ్రిడ్జిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేసి పనులను మొదలు పెట్టింది. కోడుమూరు పట్టణంతో పాటు వెంకటగిరి, ప్యాలకుర్తి, రామచంద్రాపురం, వర్కూర్, చనుగొండ్ల గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.30 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులన్నీ పూర్తయితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

కాటసాని చొరవతోనే భైరాపురం అభివృద్ధి



మాట్లాడుతున్న భైరాపురం వాసులు

ఓర్వకల్లు: మండలంలో టీడీపీ నాయకులకు ఓటమి భయం వెంటాడుతోంది. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి లభిస్తున్న ప్రజాదరణ చూసి జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలకు పూనుకున్నారు. ఆ పార్టీ తోక పత్రికలు నిత్యం ప్రజలను రెచ్చగొట్టే కథనాలు ప్రచురిస్తూ పత్రికా విలువలను మంటగలుపుతున్నాయి. తాజాగా భైరాపురం గ్రామంలో 'మా గ్రామంలోకి రావొద్దు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తను భైరాపురం గ్రామస్తులు తీవ్రంగా ఖండించారు. సర్పంచ్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు శనివారం నిరసన తెలిపారు. గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పరిష్కరించారని చెప్పారు. ఈ నెల 8న ఎన్నికల ప్రచారంలో భాగంగా భైరాపురం గ్రామానికి వచ్చారని.. ఆయనకు అన్ని సామాజికవర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభించడంతో జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు కుట్రరాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వాస్తవాలను తెలుసుకోకుండా పచ్చపత్రికలు అవాస్తవాలు ప్రచురించాయని మండిపడ్డారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే కాటసాని విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రామకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, బి.గోకారి, వెంకటరాముడు, సుదర్శనం, స్వాములు, ఉసేనయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన

- కూటమికి ఓటుతో బుద్ధి చెప్పండి
- సీఎం వైఎస్ జగన్ హామీలన్నీ నెరవేర్చారు
- ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసానిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రచారానికి భారీగా తరలివచ్చిన మహిళలు

కల్లూరు: ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం కల్లూరు అర్బన్‌లోని మిలటరీ క్యాంటిన్, హౌసింగ్ బోర్డు కాలనీ, డాక్టర్స్ కాలనీ, శాంతనగర్, కిసాన్ నగర్ మీదుగా మాధవి నగర్ (అమ్మ ఆస్పటల్) వరకు రోడ్డు షో నిర్వహించారు. భారీగా తరలివచ్చిన ప్రజలకు ఎమ్మెల్యే అభివాదం చేస్తూ ముందుకు సాగారు. స్థానిక నాయకులు, ప్రజలు ఎమ్మెల్యేకు గజమాల, పూలమాలలతో స్వాగతం పలికారు. జై జగన్... జై కాటసాని నినాదాలు మార్మోగాయి. మాధవి నగర్ పార్కు వద్ద కాటసాని మాట్లాడుతూ.. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ఇంటి దగ్గరకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. వైఎస్ జగన్ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. జగన్ చెప్పాడంటే తప్పనిసరిగా చేస్తారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని టీడీపీ నాయకులు తనపై అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంచి చేసిన వారిని ప్రజలు ఎల్లప్పుడు గుండెలో ఉంచుకుంటారన్నారు. టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. పేదల అభ్యున్నతి కోసం నవరత్నాలు తీసుకొచ్చిన నాయకుడు వైఎస్ జగన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో రాష్ట్రంలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందని తెలిపారు. చంద్రబాబుకు ఓటు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని.. వారు చెప్పిన వారికే పథకాలు అందుతాయని చెప్పారు. వివక్ష, అవినీతి లేని పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 21వ వార్డు కార్పొరేటర్ అరుణ, నాయకులు సుకుమార్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: మండలంలోని దుర్వేశి గ్రామంలో టీడీపీకి చెందిన 15 కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కందుల సంతోష్, కరుణాకర్, ఆశీర్వాదం,రాజేష్, బాలు, నల్లగట్ల రాజు,జయరాజు, మహేష్, అరుణ్‌కుమార్, షరీష్ తదితరులు ఉన్నారు. టీడీపీలో ఎంత కష్టపడినా తగిన గుర్తింపు లేదని.. వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, రమేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



స్వాములుకు పార్టీ కండువా వేస్తున్న మాధవీలతరెడ్డి

ఓర్వకల్లు: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కాటసాని మాధవీలతరెడ్డి కోరారు. శనివారం సాయంత్రం గుట్టపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. టీడీపీకి చెందిన వడ్డె బండ స్వాములు, మరో 10 మంది మాధవీలత సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ఆర్‌కే రెడ్డి, మహేశ్వర రెడ్డి, పెద్ద సుంకిరెడ్డి, అయ్యపురెడ్డి, ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా, అక్బర్‌వలి, గడ్డం శ్రీనివాస రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

రాజశేఖర్.. నోరు అదుపులో పెట్టుకో!



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి

ఓర్వకల్లు: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్ నోరు అదుపులో పెట్టుకుంటే బాగుంటుందని.. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని వైఎస్సార్‌సీపీ కన్నమడకల ఎంపీటీసీ సభ్యుడు అన్యం సోమశేఖరరెడ్డి హెచ్చరించారు. శనివారం కన్నమడకలలో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయం శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన ఎమ్మెల్యే టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయించి రెవెన్యూ, పోలీసుల సమక్షంలో ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. అయితే టీడీపీ నాయకుడు రాజశేఖర్ గుప్త నిధుల కోసం ఆలయం పడగొట్టినట్లు ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. గుప్త నిధుల కోసమని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. ధైర్యం ఉంటే ఎమ్మెల్యేను రాజకీయంగా ఎదుర్కోవాలని, ఇలా అసత్య ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు చేయడం సిగ్గుచేటన్నారు. గ్రామంలో సుంకులమ్మ గుడి పేరు చెప్పుకుని నిధులను బొక్కేసిన సంస్కృతి మీదేనన్నారు. ఆయనతో పాటు అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కలి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

చివరి రోజు.. ప్రచార హోరు



సి.బెళగల్: ప్రచారం చేస్తున్న ముస్లిం నాయకులు



ప్యాలకుర్తిలో..



కృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి



అమడగుంట్లలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి



సి.బెళగల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం

కోడుమూరు రూరల్: ఎన్నికల ప్రచారం చివరి రోజు శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారాన్ని హోరెత్తించారు. గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి ఐదేళ్ల సంక్షేమ పాలనను వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్‌ను గెలిపించాలని కోరారు. కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామంలో మండల ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి సర్పంచ్ శ్రీనివాసరెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. పేదలకు మంచి చేస్తున్న జగన్‌కు మద్దతు తెలపాలని కోరారు.

☛ అమడగుంట్లలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యుడు తిరుపతయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ మధుమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, సత్యనారాయణరెడ్డి, పీపీ కృష్ణారెడ్డి, సాగర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.

☛ ప్యాలకుర్తిలో మాజీ సర్పంచ్‌లు ఉసేనాశం, రంగన్న, కోఆప్షన్ మెంబర్ బందెనవాజ్, ఎంపీటీసీ సభ్యులు శాంతప్ప, అనసూయమ్మ, మాజీ ఎంపీటీసీ ముల్లా సలీం, నాయకులు రామకృష్ణారెడ్డి, జుట్ల వెంకటేశ్వర్లు, నాగభూషణం, భాస్కరరెడ్డి, మిన్నెల్ల, రామిరెడ్డి, సులేమాన్, గిడ్డయ్య, రంగన్న ఇంటింటి ప్రచారం చేశారు.

☛ గోరంట్లలో మాజీ సర్పంచ్ నక్కపరమేశ్వరనాయుడు, ఎంపీటీసీ సభ్యులు చిన్న మస్తాన్, రవికుమార్, వార్డు సభ్యులు చిన్న మాదన్న, వెంకట్రాముడు, చిన్న పరశురాముడు, చెరుకులపాడు బాలు, కైలాస్ ఓట్లు అభ్యర్థించారు.

☛ సి.బెళగల్: మండల కేంద్రంతో పాటు కంబదహాల్, గొల్లలదొడ్డి, క్రిష్ణదొడ్డి, బ్యాతోలి, కొండాపురం, పలుకుదొడ్డి, సంగాల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ కార్యదర్శి ఎస్ఎం బాషా, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ముల్లా హారున్, నాయకులు బాయికాటి మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, లచ్చప్ప, వేణుగోపాల్‌రెడ్డి, ఫరుక్, షుకూర్ తదితరులు ప్రచారం చేశారు.